సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 31 । జనవరి । 2025



ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికుల సమ్మె నోటీస్

ఫెర్టిలైజర్‌సిటీ: కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు నరేశ్ కేంద్ర కార్మిక అధికారికి సమ్మె నోటీసు అందజేశారు.



కానిస్టేబుళ్లకు పదోన్నతి

గోదావరిఖని: ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన ఆరుగురిని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తన కార్యాలయంలో గురువారం అభినందించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/19.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటిపూట ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, రాత్రి వేళ చలిగా ఉండి, మంచుకురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కుష్టు బాధితులకు ఉచిత చికిత్స



ప్రతిజ్ఞ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణు

పెద్దపల్లిరూరల్: కుష్టు సోకినవారికి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత చికిత్స అందిస్తున్నామని, దీనిని పూర్తిగా నయం చేయొచ్చని అడిషనల్ కలెక్టర్ వేణు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కుష్టు నియంత్రణపై డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారితో కలిసి అవగాహన కల్పించారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాలలు, కాలేజీలతోపాటు ఊరూరా కుష్టుపై అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

సమరయోధులకు నివాళి

దేశ స్వాతంత్ర్యోద్యమంలో వీరోచితంగా పోరాడి అమరులైన వారికి అడిషనల్ కలెక్టర్ వేణు కలెక్టరేట్‌లో నివాళి అర్పించారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ బండి ప్రకాశ్, మైనింగ్ ఏడీ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి, డీవైఎస్‌వో సురేశ్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్, బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు



నీటిపారకం పరిశీలిస్తున్న ఎస్ఈ సత్యప్రసాద్

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో గల చివరి ఆయకట్టుకూ ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు అందించాలని ఇరిగేషన్ ఎస్ఈ సత్యప్రసాద్ ఆదేశించారు. స్థానిక పూసాల ప్రధాన కాలువలో సాగునీటి పారకాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కాలువల వెంట చెట్లు, తుమ్మలు తొలగించాలని, చివరి భూములకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యోగుల నెల వేతనంలో కోత విధిస్తామని ఆయన హెచ్చరించారు. వారబందీ పద్ధతిన సాగునీరు సరఫరా అవుతోందని, అధికారులు, సిబ్బంది కాలువల వెంట గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈఈ ప్రసాద్, డీఈ మధుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

జ్యోతినగర్(రామగుండం): పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతశాతం పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి సూచించారు. ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కెరీర్ కౌన్సెలింగ్, మార్గదర్శకత్వంపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు పరీక్షలపై భయం పోగొట్టి, కెరీర్‌పై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని 115 మంది స్కూల్ అసిస్టెంట్లు శిక్షణకు హాజరయ్యారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి షేక్, ఎంఈవో చంద్రయ్య, కోర్సు కన్వీనర్ గొర్రె జయరాజు, జిల్లా రిసోర్స్ పర్సన్లు ఆగయ్య, మల్లేశం, అబ్బర్వర్ ప్రద్యుమ్న కుమార్, సీఆర్‌పీలు రామ్‌కుమార్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభ వాయిదా

రామగుండం: కుందనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మొగల్‌పహాడ్ భూముల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించాల్సిన గ్రామసభను హైకోర్టు ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎన్టీపీసీ యాజమాన్యం అదనంగా స్థాపించే విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు కోసం భూసేకరణ చేపడుతోంది. అయితే, సర్వే జాబితాలో గ్రామానికి చెందిన కొందరు లబ్ధిదారుల పేర్లు గల్లంతైనట్లు గుర్తించిన పలువురు హైకోర్టును ఆశ్రయించారని, అందుకే గ్రామసభను రద్దు చేయాలని కోర్టు ఉత్తర్వులు వెలువరించిందని పేర్కొన్నారు. గ్రామసభను మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

వాహన పన్ను చెల్లించాలి

పెద్దపల్లిరూరల్: వాహనదారులు సకాలంలో పన్ను చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావు సూచించారు. వాణిజ్య, వాణిజ్యేతర వాహనదారులు తమ వాహనాల పన్నును సకాలంలో చెల్లించి సహకరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 3,120 వాహనాలు ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్నాయని పేర్కొన్నారు. తనిఖీల్లో పట్టుబడితే చెల్లించాల్సిన వాహన పన్నుపై మొదటి నెల 50 శాతం, రెండోనెల 100 శాతం, మూడోనెల 200శాతం జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

ఆమె జాడేది?



- ఎమ్మెల్సీ పోటీకి ఆసక్తి చూపని మహిళా నాయకులు
- నాలుగు పాత జిల్లాల్లో 1.23 లక్షల ఓట్లు వారివే
- ఉపాధ్యాయుల ఓటర్లలో సగానికిపైగా మహిళలే
- టీచర్, గ్రాడ్యుయేట్లలోనూ ఉమ్మడి కరీంనగర్ టాప్
- నామినేషన్లలోనైనా తెరపైకి వచ్చేనా?

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కరీంనగర్–మెదక్–నిజామాబాద్– ఆదిలాబాద్ జిల్లాల శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. బుధవారం మధ్యాహ్నం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. గత మూడు నాలుగునెలలుగా పలువురు అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయబరిలో పోటీ చేస్తామంటూ హడావుడి చేస్తున్నారు. భారీ బహిరంగ సభలు, ప్రకటనలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరంతా పురుషులే కావడం, ఇంతవరకూ ఒక్క మహిళా నేతైనా బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపకపోవడం గమనార్హం. వాస్తవానికి పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్ల జాబితాలో మహిళలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నారు. దాదాపు 3.4 లక్షల పట్టభద్రుల ఓటర్ల జాబితాలో 50 శాతం కంటే అధికంగా అంటే 1.2 లక్షల మంది మహిళలే. అదే విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో మహిళల సంఖ్య అధికంగా ఉంది. మొత్తం ఓటర్లు 16 వేలకుపైగా ఉన్న మొత్తం ఓటర్లలో దాదాపు 10 వేలమంది మహిళా ఉపాధ్యాయ, అధ్యాపకులే కావడం విశేషం. అయినప్పటికీ.. రాజకీయంగా మహిళలు ఎవరూ ఇంతవరకు ముందుకు రాలేదు. వచ్చే నెల 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై.. 10వ తేదీన ముగియనుంది. కనీసం అప్పటికైనా మహిళా అభ్యర్థులు బరిలో ఉంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది. బీజేపీ అందరి కంటే ముందే అభ్యర్థులను ప్రకటించింది. ఇక బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులంతా పురుషులే. కనీసం స్వతంత్రుల్లోనూ మహిళలు ఎవరూ లేకపోవడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీచేసిన అభ్యర్థులు ముందుజాగ్రత్తగా డమ్మీలుగా భార్యలతో నామినేషన్ వేయించారు. ఈసారి ఎన్నికల్లో మహిళ అభ్యర్థులు కనీసం డమ్మీలుగానైనా వస్తారా? లేదా అన్నది వేచి చూడాలి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాప్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల విషయంలో ఉమ్మడి జిల్లా అగ్రభాగాన ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1.55 లక్షల ఓట్లు ఉండగా.. అందులో 61 వేల పైచిలుకు మహిళా ఓట్లు పాత జిల్లాకు చెందినవే. అందులోనూ కరీంనగర్ (27,992) ఓటర్లతో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో జగిత్యాల (13,206), పెద్దపల్లి (11,638), రాజన్నసిరిసిల్ల (8,323) జిల్లాలు నిలిచాయి. అదే విధంగా ఉపాధ్యాయ ఓటర్లలో మొత్తం 16 వేల ఓటర్లలో 10 వేల వరకు మహిళలే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 4,951 ఓట్లు ఉండగా అందులో 2,708 మహిళలే ఉన్నారు. వాటిలోనూ కరీంనగర్ (1,508 ఓట్లు) తొలిస్థానంలో నిలువగా, జగిత్యాల (509), పెద్దపల్లి (450), సిరిసిల్ల (241) జిల్లాలు ఆ తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి.

పట్టభద్రుల ఓటర్లు ఇలా..

జిల్లా	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
ఆసిఫాబాద్	4106	1749	0	5855
మంచిర్యాల	18882	11606	0	30488
ఆదిలాబాద్	10104	4482	0	14586
నిర్మల్	11271	5538	0	16809
నిజామాబాద్	19368	11225	0	30593
కామారెడ్డి	11228	4587	1	15816
జగిత్యాల	21075	13206	0	34281
పెద్దపల్లి	18430	11638	1	30069
కరీంనగర్	41665	27992	0	69657
రాజన్న సిరిసిల్ల	13290	8323	1	21614
సంగారెడ్డి	14437	6766	0	21203
మెదక్	8533	3420	0	11953
సిద్దిపేట	20922	10624	0	31546
హనుమకొండ	3055	1368	0	4423
జయశంకర్‌భూపాలపల్లి	1694	726	0	2420
మొత్తం	2,18,060	1,23,250	3	3,41,313

ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య

జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆసిఫాబాద్	314	143	457
మంచిర్యాల	940	610	1550
ఆదిలాబాద్	1073	488	1561
నిర్మల్	1263	681	1944
నిజామాబాద్	2100	1429	3529
కామారెడ్డి	1341	720	2061
జగిత్యాల	1197	509	1706
పెద్దపల్లి	609	450	1059
కరీంనగర్	2512	1508	4020
రాజన్న సిరిసిల్ల	633	241	874
సంగారెడ్డి	1485	1103	2588
మెదక్	766	515	1281
సిద్దిపేట	1948	1104	3052
హనుమకొండ	120	38	158
జయశంకర్ భూపాలపల్లి	63	18	81
మొత్తం	1,6,364	9557	2,5,921

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల సన్నద్ధతపై అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, వేణుతో కలిసి సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లు స్ట్రాంగ్‌రూంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్థానిక పరిస్థితుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలను విభజించాలని, సమస్యాత్మక కేంద్రాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హఠాన్మరణం చెందిన అంతర్గాం ఎంపీడీవో అలీముద్దీన్ ఆత్మశాంతికి అధికారులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. డీపీవో వీర బుచ్చయ్య, జెడ్పీ సీఈవో నరేందర్, హౌసింగ్ ఈఈ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎంపీడీవో కార్యాలయం సందర్శన

ఆర్టీసీ బస్‌డిపో కోసం సొంతభవనం ఖాళీచేసి అద్దెభవనంలోకి మారిన ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. కార్యకలాపాల కోసం వసతులు సమకూర్చుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు సూచించారు. జెడ్పీ సీఈవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీచేయాలని అన్నారు.

కార్యకర్తలే నా బలం, బలగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కార్యకర్తలే తన బలం, బలగమని, ఎమ్మెల్యే వివజయరమణారావు అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య అధ్యక్షతన గురువారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లోని ఎస్సారెస్పీ కాలువల్లో సాగునీటి పారకాన్ని పరిశీలించారు. మరికొన్ని కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య తదితరులు సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రయోగ కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- పారదర్శకంగా పరీక్షల నిర్వహణ
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- 3 నుంచి జిల్లాలో పరీక్షలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి మూడోతేదీన ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థుల కోసం జిల్లా వ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 2,583 మంది విద్యార్థులు, 1,986 మంది ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారని అధికారులు తెలిపారు. ప్రతీరోజు రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు ఉంటాయని అధికారులు వివరించారు. మొత్తం 4 విడతలుగా ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 22న ప్రాక్టికల్ పరీక్షలు ముగుస్తాయి.

14 ప్రభుత్వ.. 16 ప్రైవేట్ కాలేజీల్లో..

జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా వాటన్నింటా అధికారులు ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా 16 ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లోనూ పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు విద్యార్థులకు నెలరోజులుగా ప్రాక్టికల్స్ ఎలా చేయాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులపై నిఘా ఉంటుంది. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఇంటర్ బోర్డు గతంలోనే ఒక్కో కేంద్రానికి రూ.12వేల చొప్పున మంజూరు చేసింది.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో కల్పన

అధిక మార్కుల కోసం..

సబ్జెక్ట్ అధ్యాపకులు ప్రాక్టికల్ పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నారు. పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ముఖ్యంగా తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించారు.

తనిఖీ బృందాలు..

ప్రతీ ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ప్రయోగ పరీక్షలు సజావుగా సాగేందుకు డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, హెచ్‌పీసీ, డీఈసీ సభ్యులను నియమించారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వొకేషనల్, ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులు అత్యధికంగా మార్కులు సాధించేలా అవగాహన కల్పిస్తున్నాం. ఈసారి ల్యాబ్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

– కల్పన, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి

రోడ్డెక్కిన పత్తి రైతులు



రాస్తారోకో చేస్తున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు



ఈ మహిళా రైతు పేరు వేల్పుల సత్తమ్మ. స్వగ్రామం పెద్దపల్లి శివారులోని చందపల్లి. ఇదివరకు రెండుసార్లు పత్తి విక్రయిస్తే క్వింటాలుకు రూ.7,600 చొప్పున ధర ధర పలికింది. గురువారం తెచ్చిన పత్తి ధర రూ.6,016కు మించి పైసా పలుకలేదు. కనీసం రూ.7వేల వరకు వచ్చినా బాగుండేదని వాపోయింది.

- ధర తగ్గిందని నిరసన
- రాజీవ్ రహదారిపై బైఠాయింపు
- ఆగిన వాహనాల రాకపోకలు
- సముదాయించిన అధికారులు

పెద్దపల్లిరూరల్: పత్తి ధరలు పతనమవుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ మార్కెట్లలో తెల్లబంగారం ధరలు పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ–నామ్ (ఈ – నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) పద్ధతిన స్థానిక మార్కెట్‌యార్డులో పత్తి కొనుగోళ్లు సాగుతున్నాయి. వారంక్రితం సర్వర్ మొరాయించడంతో కొనుగోళ్లు అర్థంతరంగా నిలిచిపోయాయి. గురువారం ఏకంగా పత్తి ధర తగ్గిందని ఆగ్రహించిన రైతులు.. మార్కెట్ ఎదుట గల రాజీవ్ రహదారిపైకి వచ్చి నిరసనకు దిగారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

అధిక తేమశాతమే..

మార్కెట్‌కు గురువారం రైతులు తీసుకొచ్చిన పత్తిలో తేమశాతం అధికంగా ఉందని, అందుకే ధర తగ్గిందని వ్యాపారులు తెలిపారు. అంతేకాదు.. రైతులు తొలిసారి, రెండోసారి ఏరి తెచ్చిన పత్తి నాణ్యంగా ఉండేదని, దీంతో గిట్టుబాటు మంచి ధర లభించిందని అంటున్నారు. చాలావరక ఇప్పుడు పత్తి నిల్వలు చివరిదశకు చేరాయని, అయితే, రైతులు కూడా నీళ్లుచల్లి తేవడంతో నాణ్యత కావడం లేదని పేర్కొంటున్నారు.

గరిష్ట ధర రూ.7,031

స్థానిక మార్కెట్‌లో గురువారం పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.7,031 ధర పలికింది.



రైతుల ధర్నాతో నిలిచిన వాహనాలు

కనిష్ఠంగా రూ.5,000 నమోదైంది. ఇందులో 13మంది రైతులు తీసుకొచ్చిన 52 బస్తాలకే రూ.7వేలకు పైగా ధర దక్కింది. 54 మంది తీసుకొచ్చిన 86 బస్తాల్లోని పత్తికి కనిష్ఠంగా రూ.5వేల – రూ.5,500లోపు పలికింది. 79 మంది 86 బస్తాల్లో తీసుకొచ్చిన పత్తికి క్వింటాలుకు రూ.5,501 – రూ.6,000 లోపు, రూ.6,001 – రూ.6,500 ధర 256 మంది తెచ్చిన 884 బస్తాలకు, రూ.6,501 – రూ.7,000 ధర 114మంది తెచ్చిన 445 బస్తాల్లోని పత్తికి ధర దక్కింది. మొత్తంగా ఈరోజు 1,654 బస్తాల్లోని 1,819 క్వింటాళ్ల పత్తిని అధికారులు కొనుగోలు చేశారు.

వ్యాపారులతో చర్చలు..

ధర విషయంలో రైతులు, వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదం రాస్తారోకో వరకూ వెళ్లడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ ఆందోళనకారులతో చర్చలు జరిపారు. అయితే, యార్డుకు ఒకటి, రెండు బస్తాలు తీసుకొచ్చిన రైతులు పత్తి విక్రయించేందుకు మొగ్గుచూపడంతో రాత్రివరకూ కొనుగోళ్లు సాగాయి. మిగిలిన రైతుల పత్తిని శుక్రవారం కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈసారే ధర తగ్గించిండ్రు



మార్కెట్‌లో ఇదివరకు రెండుసార్లు పత్తి అమ్మిన. మంచి ధరనే వచ్చింది. కానీ ఈసారే ధర రూ.6వేలు అంటుండ్రు. కనీసం రూ.7 వేలకు మించి ధర ఇచ్చేలా అధికారులు చూడాలి.

– కుందారపు లక్ష్మయ్య, రొంపికుంట

గింత అన్యాయమా?



నాకున్న కొద్దిపాటి చేనులో పత్తి ఏసిన. ఇదివరకు క్వింటాలుకు రూ.7,800 ధర వచ్చింది. ఇప్పుడు రూ.6,080 ధర వేసిండ్రు. ఇదేమిటని అడిగితే నాణ్యతను బట్టి పత్తి ధర ఉంటదంటుండ్రు.

– పొన్నం పెద్దకొమురయ్య, భోజన్నపేట

నాణ్యతకే గిట్టుబాటు



ఇదివరకు నీళ్లు చల్లకుండా పత్తి తెచ్చిన రైతులు.. ఈసారి నీళ్లు చల్లడంతో తేమశాతం పెరిగింది. రైతులు, వ్యాపారులతో చర్చించి క్వింటాలుకు రూ.300 – రూ.500 వరకు(నాణ్యతను బట్టి) ధర చెల్లించేలా చర్యలు తీసుకున్నాం. అందుకే కొనుగోళ్లు సాఫీగా సాగాయి.

– దేవరాజ్ పృథ్వీరాజ్, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి



- 2 నుంచి మార్చి 17 వరకు ముహూర్తాలు

మోగనున్న పెళ్లి బాజాలు

విద్యానగర్(కరీంనగర్)/జ్యోతినగర్(రామగుండం): మాఘమాసం గురువారం ప్రారంభమైంది. ఇక, పెళ్లి బాజాలు మోగనున్నాయి. గృహ ప్రవేశాలకు అన్నీ మంచి రోజులే. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 17 వరకు ముహూర్తాలుండగా.. వాటిలో ఫిబ్రవరి 16, మార్చి 16న ఎక్కువ పెళ్లిళ్లు జరుగుతాయని కరీంనగర్‌కు చెందిన మయూరగిరి పీఠాధిపతి, జ్యోతిష్య, వాస్తు పండితుడు నమిలికొండ రమణాచార్యులు, మల్కాపూర్‌కు చెందిన పురోహితుడు రుద్రభట్ల సత్యనారాయణ తెలిపారు. ఫిబ్రవరిలో 2, 3, 7, 13, 14, 15, 16, 21, 23, 25, మార్చిలో 2, 6, 7, 12, 14, 15, 16, 17 తేదీల్లో పెళ్లి ముహూర్తాలున్నాయని పేర్కొన్నారు. వివాహాలకు సిద్ధమవుతున్నవారు ఫంక్షన్‌హాళ్లు, డెకరేషన్, కేటరింగ్ బుకింగ్ తదితర పనుల్లో బిజీ అయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు వసతులను బట్టి రూ.40 వేల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకుంటున్నారు. పెళ్లిళ్ల సీజన్ మొదలవడంతో వస్త్ర, బంగారం దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తున్నాయి.

క్లుప్తంగా

కరెంట్ సమస్యలా..? '1912'కు కాల్‌చేయాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ మాధవరావు తెలిపారు. వచ్చే వేసవిలోనూ నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయినా వినియోగదారులు సమస్యలు ఉన్నట్లు భావిస్తే వెంటనే 1912 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. ఫిర్యాదుపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

అసిస్టెంట్ కమిషనర్ బదిలీ



అసిస్టెంట్ కమిషనర్ రాజలింగును సత్కరిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ టి.రాజలింగు గురువారం మంచిర్యాల జిల్లా మందమర్రికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాజలింగును నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ శాలువా సత్కరించారు.

అంకితభావంతో పనిచేయండి



అభినందనపత్రం అందిస్తున్న అనిల్

గోదావరిఖని: అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందని ఆర్జీ–2 పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్ అన్నారు. ఏరియాలోని క్వార్టర్స్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీలేఖకు గురువారం ప్రసంశాపత్రంతోపాటు బహుమతి అందజేసి అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాణ్యత, అత్యుత్తమ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. తోటి ఉద్యోగులు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైపీఎంలు వేణుగోపాల్, వంశీధర్, చిప్ప సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సంజీవ్, మౌనిక, మమత, దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాకుమారకు జాతీయ పురస్కారం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన ప్రముఖ కవి, రచయిత రాకుమార రచించిన 'నిశ్శబ్ద వసంతం' కవిత జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపికైంది. గతేడాది డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలోని పల్లంటి ఆదిలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కవితా పోటీలు నిర్వహించారు. రాకుమార.. 'పర్యావరణాన్ని పరామర్శిస్తున్న ప్రళయాల సాక్షిగా.. వనాలు క్రుంగిపోతూ భవనాలు మొలకెత్తుతున్నాయి' అంటూ 'నిశ్శబ్ద వసంతం' కవిత రాయడంతో జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపిక చేసినట్లు గురువారం నిర్వాహకులు ప్రకటించారు. ఈ ఏడాది మార్చి 10న రాకుమారకు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నట్లు సంస్థ నిర్వాహకుడు పల్లంటి వెంకట రామకుమారరావు తెలిపారు.

వేగంగా ఆస్తిపన్ను వసూలు

- పారిశుధ్య విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- బల్దియా పనితీరుపై కలెక్టర్ సమీక్ష



డంపింగ్‌యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): ఆస్తిపన్ను వసూళ్లల్లో వేగం పెంచాలని రామగుండం బల్దియా స్పెషలాఫీసర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అభివృద్ధి పనులు, అధికారుల పనితీరుపై ఎఫ్ఏసీ కమిషనర్ అరుణశ్రీతో కలిసి బల్దియా కార్యాలయంలో గురువారం ఆయన సమీక్షించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా పనిచేయాలన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా చేపట్టిన నగరాభివృద్ధి, పారిశుధ్యం నిర్వహణ, ఆస్తిపన్ను వసూళ్ల పురోగతి, టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు తదితర విభాగాలపై ఆరా తీశారు. వరద నియంత్రణ పనులకు ప్రాధాన్యత కల్పిస్తూనే వర్షాకాలం నాటికి పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా చూసుకోవాలన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం శాంతినగర్ డీఆర్‌సీసీ సెంటర్, మేడిపల్లిలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ రామలింగు, ఎస్ఈ శివానందం, ఈఈ రామణ్ తదితరులు పాల్గొన్నారు.

డార్క్ స్పాట్స్ లేకుండా చర్యలు

ఫిబ్రవరి 15 నాటికి నగరంలో డార్క్ స్పాట్ (చీకటి ప్రదేశం) లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష తెలిపారు. రూ.కోటి 30 లక్షలు వెచ్చించి 300 విద్యుత్ స్తంభాలు, 2 వేల లైట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 15 వరకు ఈ పనులను పూర్తి చేయిస్తామని వెల్లడించారు. వేసవిలో తాగునీటి సమస్యత రాకుండా చర్యలు చేపట్టామన్నారు. మరో రూ.కోటి 30లక్షలు వెచ్చిస్తూ పైప్‌లైన్‌లీకేజీలు, ట్యాంక్‌లు, బోరుబావుల రిపేర్లు చేస్తామని అన్నారు. నీటి సరఫరా సజావుగా సాగేందుకు లెవల్ ఇండికేటర్లు కూడా తెప్పిస్తున్నామని వెల్లడించారు. ఆస్తిపన్ను బకాయిలు రూ.7కోట్ల 80 లక్షల వరకు ఉన్నాయని, మార్చి 31 వరకు బకాయిదారులు ఆస్తిపన్ను చెల్లించాలని కోరారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



రాజీవ్ రహదారిపై బైఠాయించిన నాయకులు, మహిళలు

- ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి
- ముదిరాజ్ సంఘం నాయకుల డిమాండ్
- రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన స్థానికులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని గురువారం రాత్రి ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ముదిరాజ్ సంఘం నాయకులు, మహిళలు డిమాండ్ చేశారు. నాయకులు కొలిపాక కృష్ణ, సంతోష్ తదితరులతో పాటు మహిళల ఆధ్వర్యంలో స్థానిక కమాన్ వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం బైఠాయించారు. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో సమాచారం అందుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్సై రామస్వామి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో వారు శాంతించారు. అనంతరం నాయకుడు కొలిపాక కృష్ణ తదితరులు మాట్లాడారు. పెద్దమ్మనగర్ ప్రాంతంలోని ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి ఆలయాన్ని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కొలిపాక నర్సయ్య రూ.40 లక్షలు వెచ్చించి ఆధునికీకరించారని గుర్తుచేశారు. ఆలయం ఎదుట పేర్లు రాయించుకోవడాన్ని జీర్ణించుకోలేని బూతగడ్డ రాజ్‌కుమార్, బూతగడ్డ నరేశ్ ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి నా పట్టించుకోలేదని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధితోపాటు మాజీ కౌన్సిలర్ బూతగడ్డ సంపత్ అండదండలు నిందితులకు ఉన్నా యని ఆరోపించారు. పోలీసులు స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఏఐపై మరింత అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భార్గవ్

- ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భార్గవ్

రామగిరి(మంథని): ప్రస్తుతం ఏఐ విస్తృమైందని, దానిపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.భార్గవ్ అన్నారు. సెంటినరీకాలనీ మంథని జేఎన్టీయూలో ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, హైదరాబాద్ 68వ ఆవిర్భావం సందర్భంగా చాప్టర్ చైర్మన్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏఐపై గురువారం అవగాహన కల్పించారు. భార్గవ్ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) టూల్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండలన్నారు. ఆధునిక సాంకేతికతలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) విప్లవాత్మక శక్తిగా మారిందన్నారు. ఏఐ టూల్స్‌తో పరిశోధనలు సులభం అవుతాయని తెలిపారు. ఏఐ ఇంజినీరింగ్‌లోనే కాకుండా అన్నిరంగాల్లోనూ ఉపయోగకరంగా ఉంటోందని వివరించారు. సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐఐఐఈ సెక్రటరీ కె.చంద్రశేఖర్, ఆర్జీ–2,3 జీఎంలు బండి వెంకటయ్య, నరేంద్ర సుధాకర్‌రావు, ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అమలుకాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం'



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ అనేక అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలోని గాంధీజీ విగ్రహానికి గురువారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన త్యాగాలు గుర్తుచేశారు. అనంతరం కాంగ్రెస్ తీరు మారాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మూల విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, గాధం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, బాదే అంజలి, శివకుమార్, నాయకులు మారుతి, బోడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్, రాకం వేణు, అచ్చే వేణు, తోట వేణు, సట్టు శ్రీనివాస్, తోకల రమేశ్ పాల్గొన్నారు.

బండలవాగు చెరువు ట్రయల్ రన్



చెరువులోకి చేరుతున్న ఎల్లంపల్లి నీరు

పాలకుర్తి(రామగుండం): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిని కుక్కలగూడూరు బండలవాగు చెరువులో నింపేందుకు చేపట్టిన ఎత్తిపోతల పనులు పూర్తికావడంతో గురువారం ఇరిగేషన్ అధికారులు ట్రయల్‌రన్ నిర్వహించారు. బండలవాగు చెరువు ద్వారా పుట్నూర్, జయ్యారం, కుక్కలగూడూరు, వేంనూర్ పరిధిలో దాదాపు 400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు తొలుత దివంగత సీఎం వైఎస్సార్, అప్పటి శాప్ చైర్మన్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చొరవతో చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ఆ తర్వాత ప్రతిపాదన మరుగున పడగా.. ఇప్పుడు కార్యరూపం దాల్చింది. త్వరలోనే అధికారికంగా ఎత్తిపోతలను ప్రారంభించి చెరువును నింపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.కోటి దాటిన కొండగట్టు అంజన్న ఆదాయం



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది, వలంటీర్లు

కొండగట్టు(చొప్పదండి) కొండగట్టు అంజన్న ఆలయానికి భక్తుల ద్వారా వచ్చిన ఆదాయం రూ.కోటి దాటింది. ఆలయంలోని హుండీల ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కింపు చేపట్టారు.70రోజులకుగాను 12 హుండీలను లెక్కించగా రూ.1,15,93,291 నగదు, 55 గ్రాముల మిశ్రమ బంగారం, మూడు కిలోల మిశ్రమ వెండి, 61 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఏఈఓ అంజయ్య, సూపరింటెండెంట్ సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ పాల్గొన్నారు.

75 ఏళ్ల వృద్ధురాలికి తుంటి శస్త్రచికిత్స



వృద్ధురాలికి శస్త్రచికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది

కరీంనగర్‌టౌన్: స్థానిక ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో అనారోగ్య సమస్యలున్న 75 ఏళ్ల వృద్ధురాలికి తుంటి ఎముక శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లికి చెందిన ఎస్.లచ్చమ్మ కిందపడగా కాలు తుంటి ఎముక విరిగింది. ఆమెను ఈనెల 25న ఆసుపత్రిలో చేర్చారు. అన్ని పరీక్షలు నిర్వహించి వయస్సును దృష్టిలో ఉంచుకోవడంతో పాటు ఆమెకు గుండె వ్యాధి, అస్థమా, రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. పేషెంట్ పరిస్థితిని అంచనా వేస్తూ గురువారం శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఆపరేషన్ తర్వాత లచ్చమ్మ ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. శస్త్రచికిత్సలో డాక్టర్లు ఆదిత్య, సంగీత, మహేశ్, ఉబేదుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండంలో 'దక్షిణ్' ఆగదు

- హాల్టింగ్ ఎత్తివేసిన రైల్వే అధికారులు
- అయోమయంలో ప్రయాణికులు



రామగుండం: వివిధ రూట్లలో ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలనే డిమాండ్, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరుగుతోంది. కానీ, ఉన్న రైళ్ల హాల్టింగ్ ఎత్తివేయడంతో ప్రయాణికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ప్రతీరోజు రాత్రి హైదరాబాద్ – హజ్రత్ నిజాముద్దీన్ (రైలు నంబరు 12721) మధ్య నడిచే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు హజ్రత్ నిజాముద్దీన్ వెళ్లే క్రమంలో రామగుండంలో హాల్టింగ్ ఎత్తివేశారు. ఇదే రైలు తిరుగు ప్రయాణంలో రామగుండంలో హాల్టింగ్ కొనసాగిస్తున్నారు. ఈ నిర్ణయంపై ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. తమ పనులు ముగించుకొని సికింద్రాబాద్‌లో రాత్రి పదకొండు గంటలకు బయలు దేరడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతవాసులకు సౌకర్యంగా ఉండేది. రైల్వే అధికారులపై ప్రయాణికులు, ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఆర్నెల్లక్రితం రైలుకు రామగుండంలో హాల్టింగ్ కల్పించిన అధికారులు.. మూడు రోజుల క్రితం ముందస్తు సమాచారం లేకుండా హాల్టింగ్ ఎత్తివేయడంతో ప్రయాణికులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఓ వైపు హైద్రాబాద్/సికింద్రాబాద్–కాగజ్‌నగర్ మధ్య మరిన్ని నూతన రైళ్లను ప్రవేశపెట్టాలని, మరికొన్నింటికి హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని రైల్వేశాఖపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో రైల్వేశాఖ ఏకపక్షంగా హాల్టింగ్ ఎత్తివేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పందించి రైల్వే జీఎంతో సంప్రదింపులు జరిపి హాల్టింగ్ పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లక్ష్య సాధనలో అగ్రగామిగా నిలవాలి

- సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు



మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

గోదావరిఖని: నిర్దేశిత లక్ష్య సాధనలో ఓసీపీ–3 అగ్రగామిగా నిలవాలని సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు కోరారు. గురువారం ఓసీపీ–3ను ఆయన సందర్శించి అధికారులతో సమావేశమయ్యారు. వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ప్రాజెక్ట్ క్వారీలోకి వెళ్లి పనిస్థలాలను పరిశీలించారు. ప్రాజెక్ట్ స్థితి గతులపై ఆరా తీశారు. యంత్రాల వినియోగం, పనితీరుపై అధికారులకు సూచనలు చేశారు. సీహెచ్‌పీలో బొగ్గు రవాణా తదితర విషయాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు సకాలంలో బొగ్గు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, ప్రాజెక్టు అధికారి ఎస్.మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, సర్వే అధికారి నర్సింగారావు, పవర్ సిస్టం ఎస్ఈ నర్సింహులు, సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్, సీహెచ్‌పీ ఎస్ఈ సదానందం తదితరులు ఉన్నారు.



చకచకా ఠాణా పనులు

జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ఏడీఏ కార్యాలయాన్ని ఆధునికీకరిస్తున్నారు. ఇందులోనే రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఠాణా నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా కొనసాగిస్తున్నారు. –పెద్దపల్లిరూరల్

తగ్గేదేలే..



చక్రంబంధంలా కబడ్డీ టాకిల్



టగ్ ఆఫ్ వార్‌లో..



వాలీబాల్‌లో..

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లో జరుగున్న 3వ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడోత్సవాల్లో పలువురు క్రీడాకారులు తగ్గేదేలే అంటూ రాణిస్తున్నారు. క్రీడల్లో ఇంకా తమ వన్నె తగ్గలేదంటూ ఒక జట్టును మించి మరో జట్టు అద్భుతమైన ప్రదర్శన ఇస్తూ ఆకర్షణగా నిలుస్తున్నాయి.



చిక్కదు దొరకదులా బాస్కెట్ బాల్‌లో..



యోగానందం

ఇద్దరి పట్టివేత.. గంజాయి స్వాధీనం

మంథని: ఎక్లాస్‌పూర్ సమీపంలోని గాడుదలగండిగుట్ట వద్ద గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కవర్‌తో గంజాయితో పాటు రూ.4వేలు స్వాధీనం చేసుకున్నారు. మంథని శ్రీపాదకాలనీకి చెందిన తైదాల సురేశ్, తుత్తుర్ల మహేశ్ కొద్దిరోజులుగా పరిచయస్తులైన కోరవేనా రవిసాగర్, ఆసంపల్లి తరుణ్, గుండా యశ్వంత్, టాంక్ గోవింద్‌సింగ్, అంకూస్ గంజాయి తాగుతున్నారు. రూ.వెయ్యి చొప్పున రూ.7వేలు జమచేసుకొని సురేశ్, మహేశ్ హైదరాబాద్ వెళ్లి ధూల్‌పేటలోని లడ్డు వద్ద 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. అందులో కొంత గుర్తు తెలియని వారికి విక్రయించగా.. రూ.4 వేలు వచ్చాయి. మిగిలింది తాగే క్రమంలో మిగతా స్నేహితుల కోసం ఎదురుచూస్తున్నారు. అటుగా వస్తున్న పోలీసులను చూసి భయపడి పారిపోయారు. పోలీసులు వెంటపడి వారిని పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పాముకాటుతో స్వీపర్ మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కిష్టంపేట గ్రామానికి చెందిన పార్ట్‌టైం స్వీపర్ బండి మధునయ్య(55) పాముకాటుతో మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం చెత్త తొలగిస్తుండగా పాముకాటుకు గురైన మధునయ్యను కరీంనగర్ ఆస్పత్రికి అక్కడి నుంచి ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మధునయ్య కుటుంబసభ్యులకు ఉద్యోగ అవకాశం కలిపించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి న్యాయం చేస్తామని ఎంఈవో మహేశ్, ఎస్సై వెంకటేశ్ నచ్చజెప్పారు.